మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు, అక్టోబర్ 19: మైనర్లకు తల్లిదండ్రులు బైకులు, కార్లు ఇవ్వరాదని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి సూచించారు. శనివారం తాండూరు కళాశాల సమీపంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. విద్యార్థులు బైకులు తీసుకు రావడాన్ని పరిశీలించారు. 25 బైక్‌లను పట్టుకొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీతో పాటు పట్టణ సీఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇస్తే విద్యార్థులతో పాటు తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. ముఖ్యంగా కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు విద్యార్థులు బైకులు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది మృతి చెందుతున్నారని తెలిపారు. రోడ్డు నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

◆ వికారాబాద్ సెర్ప్ అడిషనల్ డీఆర్డీవో సరోజ ◆ మహిళా సమాఖ్య మండల సర్వసభ్య సమావేశం

సమావేశంలో పాల్గొన్న సెర్ప్ అడిషనల్ డీఆర్డీవో సరోజ

కులకచర్ల, అక్టోబర్ 19 : మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని వికారాబాద్ సెర్ప్ అడిషనల్ డీఆర్‌డీవో సరోజ అన్నారు. శనివారం కులకచర్లలోని స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన మహిళా సమాఖ్య మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు 24 ఏండ్లకు పైగా సంఘాల ద్వారా వివిధ ఆధాయ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆర్థికంగా రాణిస్తున్నారని అన్నారు. అప్పట్లో రూ.50 వేలు సంఘానికి అందించే రుణం నేడు రూ.20లక్షల వరకు ఇస్తున్నారని తెలిపారు. మహిళలు తీసుకొన్న రుణాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని సూ చించారు. ప్రజలకు అవసరమయ్యే ఆహార పదార్థాల ఉత్పత్తులను చేసి ఆర్థికంగా రాణించాలని అన్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులు తమ జీవన ప్రమాణాన్ని పెంచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఇందు కోసం సెర్ప్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో కులకచర్ల ఏపీఎం శో భ, మండల సమాఖ్య అధ్యక్షురాలు అలివేణి, సీసీలు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

శాంతి సందేశం ప్రపంచానికి మార్గదర్శం

○ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ○ ఏఐపీఎస్‌వో ప్రథమ మహాసభ

వికారాబాద్, అక్టోబర్ 19: బుద్ధుడు, మహాత్మాగాంధీల శాంతి సందేశం ప్రపంచానికి మార్గదర్శమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐపీఎస్‌వో) ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచానికి శాంతి సందేశం అందించింది భారతదేశమన్నారు. ప్రపంచంలో శాంతి కోసం ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు జరుగుతున్న ఈ సమావేశాలు మన జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. మహాత్మాగాంధీ అహింస అనే ఆయుధంతో పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించారని గుర్తు చేశారు. అన్ని మతాలు బోధించేది శాంతినే అని అన్నారు. కొందరు తమ స్వార్థం కోసం దానిని వక్రీకరించి ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. అల్లర్లు సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో శాంతి స్థాపన కోసం కృషి చేస్తున్న ఏఐపీఎస్‌వో సంస్థను అభినందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఐపీఎస్‌వో జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీడిగడ్డ తండాలో చిరుత కలకలం

పరిగి :పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

కొడంగల్ : పోచమ్మతండా అటవీ ప్రాంతంలోని పంట పొలాల్లో పరిశీలిస్తున్న అటవీ, రెవెన్యూ అధికారులు

పరిగి, అక్టోబర్ 19: మండల పరిధిలోని జీడిగడ్డ తండా సమీపంలో చిరుత కలకలం సృష్టించింది. శనివారం మధ్యాహ్నం స మయంలో సమీపంలోని అటవీ ప్రాంతంలో సీతాఫలాలు తెంచడానికి వెళ్లిన వారు తమకు చిరుత కనిపించిందని చెప్పారు. దీంతో గ్రామస్తులు వెంటనే పరిగి అటవీశాఖ అధికారికి సమాచారం ఇచ్చారు. వెంటనే అటవీ శాఖ సిబ్బంది ఆ ప్రాంతాన్ని సందర్శించారు. పలు పాదముద్రలను అటవీ శాఖ అధికారులు సేకరించారు. దీంతోపాటు అసలు కనిపించింది ఏ జంతువని తెలుసుకునేందుకు వీలుగా ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ ప్రతిమ తెలిపారు. పాదముద్రలు హైనావి పోలినట్లుగా ఉన్నాయని అటవీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ట్రాప్ కెమెరా ఏర్పాటుతో ఆ ప్రాంతంలో సంతరిస్తున్న జంతువులు ఏవనేది తేలనున్నది.

పోచమ్మతండా సమీపంలో..

కొడంగల్: మండల పరిధిలోని పోచమ్మతండా సమీపంలోని అటవీ ప్రాంతంలో చిరుత సంచరిస్తున్న ఆనవాళ్లతో గిరిజనులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పంటపొలాల్లో చిరుత పాదం ఆనవాళ్లను గుర్తించిన గిరిజనులు శుక్రవారం స్థానిక అటవీ అధికారులకు ఆదుకోవాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన అటవీ అధికారులతో పాటు తహసీల్దార్ విజయ్‌కుమార్ శనివారం పోచమ్మ తండాను సందర్శించారు. అటవీ ప్రాంతంలోని పంట పొలాలను పరిశీలించారు. చిరుత సంచారంపై వివరాలు సేకరించడంతో పాటు ఆ ప్రాంత వాసులకు అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనలు పాటిస్తామన్నారు. ఎవరూ అటవీ ప్రాంతంలోకి వెళ్లరాదని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకొన్న అనంతరం రాకపోకలు కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ పరికరాలపై అవగాహన అవసరం

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జర్నప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్

పెద్దేముల్, అక్టోబర్ 19: గ్రామ పంచాయతీ మంచినీటి సహాయకులకు విద్యుత్ మోటర్ల నిర్వహణ, మరమ్మతులు, ఉపయోగించే విధానాలపై అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో జర్నప్ప, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామ పంచాయతీల మంచి నీటి సహాయకులకు విద్యుత్ పరికరాల వినియోగంపై ఓ నిపుణుడితో అవగాహన కల్పించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. విద్యుత్ మోటర్లను ఎలా చెక్ చేసుకోవాలి? ఎర్తింగ్‌ను ఏ పద్ధతిలో అమర్చుకోవాలి? ఎలా ఫిట్ చేసుకోవాలి తదితర అంశాలపై నిపుణుడితో అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ శిక్షణ మీకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో తాండూరు డివిజన్ గ్రిడ్ డీఈ విజయ్ కుమార్, ఎంపీవో రతన్ సింగ్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ ప్రతిభ, ఆయా గ్రామ పంచాయతీల మంచినీటి సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికారాబాద్ వాసికి పాండిచ్చేరిలో డాక్టరేట్

పాండిచ్చేరిలో డాక్టరేట్ తీసుకుంటున్న పట్లోళ్ల రఘువీరారెడ్డి

ధారూరు, అక్టోబర్ 19: గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ కన్వకేషన్‌లో సామాజిక సేవా విభాగంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరా రెడ్డి డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని ధారూరు మండల నాయకులు అన్నారు. శనివారం పాండిచ్చేరిలో రఘువీరారెడ్డి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచిందన్నారు. 20 ఏం డ్లుగా సామాజిక, రాజకీయ రంగాల్లో అందించిన విశేష సేవలకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మాన్‌సింగ్, ఎర్రవల్లి జాఫర్, మల్లారెడ్డి, అశోక్ ముదిరాజ్, రాఘవేందర్ గౌడ్, రాజేశ్వర్, ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రికెట్ పోటీలకు హర్షారత్నాకర్

తొరుమామిడి గ్రామస్తులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బంట్వారం, అక్టోబర్ 19: జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు మండల పరిధిలోని తొరుమామిడి గ్రామానికి చెందిన మబ్బురాజు కుమారుడు హర్షారత్నాకర్ ఎంపికయ్యారు. వికారాబాద్‌లోని శివారెడ్డిపేట గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రత్నాకర్ ఇటీవల గద్వాలలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 క్రికెట్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు వికారాబాద్ జిల్లా నుంచి ఐదుగురు ఎంపిక కాగా వీరిలో రత్నాకర్ ఉండడంతో పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీ భాను, కోచ్ విష్ణుకాంత్,

మహిళా సమాఖ్య 24వ వార్షిక మహాసభ

మాట్లాడుతున్న మహిళా సంఘం సభ్యులు

కొడంగల్, అక్టోబర్ 19: బొంరాస్‌పేట మండల పరిధిలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 24వ వార్షిక మహాసభ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, అభివృద్ధికి సంబంధించిన వార్షిక ప్రణాళికలను అధ్యక్షురాలు అనిత చదివి వినిపించారు. మహిళా సమాఖ్య అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి అంబూజన కోశాధికారి భాగ్యమ్మ, ఉపాధ్యక్షురాలు రాములమ్మ, ఏపీఎం సత్తయ్య, సీసీ యాదయ్య, సునీత, సంజప్ప, ఆజమ్మ, అజీజ్, సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏడీఏ రుద్రమూర్తి సమక్షంలో బాధ్యతలు చేపట్టిన ఏవో పవన్‌ప్రీతమ్

పెద్దేముల్,అక్టోబర్ 19: మండల పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మండల నూతన వ్యవసాయ అధికారి పవన్‌ప్రీతమ్ అన్నారు. తాండూరు ఏడీఏ రుద్రమూర్తి సమక్షంలో శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన ఏవో షేక్ నజీరొద్దీన్ జనగామ జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పవన్‌ప్రీతమ్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలిస్తానని తెలిపారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తాండూరు ఏడీఏ రుద్రమూర్తి, ఏఈవో వినయ్ కుమార్, తదితరులు ఉన్నారు.

22 నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

పరిగి, అక్టోబర్ 19: పరిగి పట్టణంలోని లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ మూడో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 22 నుంచి 24వరకు జరుగుతాయని ఆలయ ధర్మకర్తలు ఎదిరె కృష్ణ-పద్మ, నరేందర్-జయశ్రీలు తెలిపారు. యాదాద్రి ఆలయ విశ్రాంత ప్రధానార్చకులు కారంపూడి నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో, సిద్ధాంతి పార్థసారథి పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. 22న ఉదయం యాగశాల ప్రవేశం, వాసుదేవ పుణ్యాహవచనం, హోమం, ధ్వజారోహణం, సాయంత్రం దావర తోరణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న హోమం, ఉత్సవ మూర్తులకు అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. 24న ఉదయం నిత్య హోమం, మహా పూర్ణాహుతి, లక్ష్మీనర్సింహ స్వామి వారి కల్యాణోత్సవం, నివేదన, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం, సాయంత్రం లక్ష్మీ నరసింహస్వామి విగ్రహ ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి

ధారూరు : నాగారం శివారులో వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవోలు

దౌల్తాబాద్: రైతుకు సూచనలు ఇస్తున్న ఏఈవో నిఖిల్

ధారూరు, అక్టోబర్ 19: రైతులు సాగు చేసిన పంటలకు సోకుతున్న తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సంజీవ్‌రాథోడ్, శిరీషలు సూచించారు. శనివారం మండల పరిధిలోని నాగారం శివారులో రైతు నరోత్తంరెడ్డి వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వానకాలంలో సాగు చేసిన వరి పంటలో సుడిదోమ ఉధృతి అధికంగా ఉంటుందని తెలిపారు. ఇందు కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు జైదుపల్లి వెంకట్ రెడ్డి, ఎరుకలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే..

దౌల్తాబాద్: రబీ సీజన్‌లో వేరుశనగ పంటను సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏఈవో నిఖిల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవర్‌ఫస్లవాద్, పొల్కంపల్లి గ్రామాల్లో వేరుశనగ పంటలను పరిశీలించారు. పంటకు సోకే చీడ పురుగుల నివారణతో పాటు కలుపు, నీటి, ఎరువుల యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. విత్తు నాటి నప్పటి నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

22న పాలమూరుకు మాలల బస్సు యాత్ర

కొడంగల్, అక్టోబర్ 19: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాలల చైతన్య బస్సు యాత్ర ఈ నెల 22న ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చేరుకొంటుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటేశం తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14న హైదరాబాద్ నుంచి బయలు దేరిన బస్సు యాత్ర నల్గొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి మీదుగా మహబూబ్‌నగర్‌కు చేరుకొంటుందన్నారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చెన్నయ్య, కో చైర్మన్లు కేశవులు, రాంచందర్, కిషన్, రవి, కనకరాజు. వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రేపు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి

వికారాబాద్, అక్టోబర్ 19: డీఈఈ సెట్-2024కు సంబంధించి ఈ నెల 21న ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ రామాచారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పత్రాల పరిశీలనకు మరోసారి అవకాశం ఇస్తున్నామని తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీఈఈ సెట్-2024లో అర్హత మార్కులు సాధించిన అభ్యర్థులు రెండేండ్ల కోర్సులో అడ్మిషన్ పొందేందుకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. అనంతరం ఈ నెల 23 నుంచి 26వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని సూచించారు. డీఈఈ సెట్ హాల్ టికెట్, అప్లికేషన్, ర్యాంక్ కార్డుతో పాటు పదో తరగతి, ఇంటర్ మెమోలు, ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు బోనఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు అన్ని ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం

కొడంగల్, అక్టోబర్ 19: మండలంలోని అప్పాయిపల్లికి చెందిన లక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం గ్రామస్తులు చందాలు పోగు చేసుకొని రూ.11,600 మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బస్వరాజ్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాములు, హన్మంతు, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల కేంద్రాల్లో ధర్నా

మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి, అక్టోబర్ 19: రైతులకు ఇవ్వాల్సిన వర్షాకాల రైతుబంధు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతూ ఆదివారం నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతు భరోసా ఇవ్వాలి

మర్పల్లి/దోమ/కులకచర/చౌడాపూర్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసా రూ.15వేలు ఇవ్వకుండా మోసం చేసినందుకు ఆదివారం మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రాల్లో జరిగే ఈ కార్యక్రమానికి రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

24న కొబ్బరికాయల విక్రయానికి వేలం

వికారాబాద్, అక్టోబర్ 19: వికారాబాద్‌లో ఉన్న అనంతగిరి ఆలయంలో కార్తీక మాసంలో కొబ్బరికాయలు, దీపారాధన సామగ్రి విక్రయం కోసం ఈ నెల 24న మధ్యాహ్నం ఒంటి గంటకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నామని ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాట పాడిన వారికి నవంబర్ ఒకటో తేదీ నుంచి 31వరకు కొబ్బరికాయలు, దీపారాధన సామగ్రి విక్రయించుకోవచ్చని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు కొబ్బరికాయల విక్రయానికి రూ.లక్ష, దీపారాధన సామగ్రి కోసం రూ.10వేల డిపాజిట్ చేయాలన్నారు. ఆసక్తి ఉన్న వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలం పాటలో హక్కులు పొందిన వారు ఆలయ నిబంధనలు పాటించాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనల మేరకు విక్రయాలు జరుపుకోవాలని వారు సూచించారు.

కేటీఆర్‌పై స్పీకర్ వ్యాఖ్యలు సరికాదు

వికారాబాద్, అక్టోబర్ 19: బీఆర్ఎస్ హయాంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేవీ రాడార్ కోసం రూ.కోట్లు తీసుకున్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తప్పుడు ప్రచారం చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే ఆనందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నత పదవిలో ఉండి ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక వాటిని కప్పిపుచ్చుకొనేందుకు బీఆర్ఎస్ మీద బురద చల్లడం సరికాదన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న స్పీకర్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

మహిళలకు ఉచిత గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి

దోమ, అక్టోబర్ 19: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితులకు అనుగుణంగా పేదలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా శనివారం దోమ మండల పరిధిలోని శివారెడ్డిపల్లిలో మహిళలకు ఉచిత గ్యాస్ సబ్సిడీ పత్రాలను సీనియర్ నాయకుడు యాదవరెడ్డితో కలిసి ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి వెంకట్, పంచాయతీ కార్యదర్శి షాహినా బేగం, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, యువ నాయకులు అర్జున్‌రెడ్డి, సాహెబ్‌ఖాన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆర్‌బీవోఎల్ సంస్థ చైర్మన్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

కులకచర్ల, అక్టోబర్ 19: మండల పరిధిలోని తిర్మలాపూర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ పోగుల రాములు గౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శనివారం కులకచర్ల మండలం తిర్మలాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఆర్‌బీవోఎల్ సంస్థ చైర్మన్ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి హాజరై కుటుంబసభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కులకచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువుముందలితండాలో హెచ్ఎంకు సన్మానం

బదిలీపై వెళ్లిన పాఠశాల హెచ్ఎంను సన్మానించిన నాయకులు, గ్రామస్తులు

కులకచర్ల, అక్టోబర్ 19: మండల పరిధిలోని అంతారం చెరువుముందలితండాకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు ఇందిరను గ్రామస్తులు సన్మానించారు. బదిలీలో భాగంగా ఆమె వేరే పాఠశాలకు వెళ్లింది. ఈ సందర్భంగా ఆమెను సత్కరించారు. అనంతరం ఆమె పాఠశాల అభివృద్ధి కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆటో సీజ్

కులకచర్ల, అక్టోబర్ 19: మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గేట్ సమీపంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై అన్వేశ్‌రెడ్డి తెలిపారు. 300కిలోలు ఆటోలో తరలిస్తుండగా పట్టుకొన్నామన్నారు. ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED PLOTS

★ హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Broakers. 9553973999 / 6303049720.
NT-336725-All

WANTED

★ Req. Cashier, Female Waiter, South Indian Lunch & Tandoori Master, Housekeeping for Restaurant @ AS Rao Nagar. 9393123493, 7995900498.
NT-334839-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కోర్టు నోటీసు

మహారా